సాక్షి
ఆదిలాబాద్

మంగళవారం | 27 | జూన్ | 2023



'కొయ్య' కొరత తీర్చేలా..

కొయ్యబొమ్మలను పొనికి కలపతో తయారు చేస్తారు. అడవుల్లో పొనికి చెట్లు కనుమరుగవడంతో రాష్ట్ర ప్రభుత్వం పొనికి వనాల పెంపకానికి చర్యలు చేపట్టింది. 8లో▸

రక్తదానానికి ముందుకు రావాలి

ఆదిలాబాద్‌టౌన్: యువత స్వచ్ఛంద రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ అన్నారు. సోమవారం శ్రీరామ్ సేన ఆధ్వర్యంలో రిమ్స్ బ్లడ్‌బ్యాంక్‌లో రక్తదానం చేశారు. ఆరోగ్యంగా ఉన్న ప్రతిఒక్కరూ రక్తదానం చేయాలని, ఆపదలో ఉన్నవారిని ఆదుకునేందుకు ముందుకు రావాలని కోరారు. రిమ్స్ సూపరింటెండెంట్ అశోక్, అనిల్ పాల్గొన్నారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
27.6 /24.5

ఉష్ణోగ్రతలు తగ్గుతాయి. ఆకాశం మేఘావృతమై ఉంటుంది. రుతుపవనాల ప్రభావంతో చాలా ప్రాంతాల్లో వర్షం కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమ పెరుగుతుంది.

న్యూస్‌రీల్

ల్యాప్‌టాప్‌లు అందజేత



ల్యాప్‌టాప్ అందజేస్తున్న కలెక్టర్

కైలాస్‌నగర్: గిరిజన సంక్షేమశాఖ గురుకుల పాఠశాలల్లో చదివి ఐఐటీ, ఎన్ఐటీల్లో సీటు సాధించిన విద్యార్థులకు ప్రభుత్వం మంజూరు చేసిన ల్యాప్‌టాప్‌లు, ఆర్థికసాయాన్ని సోమవారం కలెక్టర్ రాహుల్ రాజ్ వారి తల్లిదండ్రులకు అందజేశారు. జలంధర్‌లో ఐఐటీ చదువుతున్న రాజుకు రూ.50వేలు, శ్రీనగర్‌లో చదువుతున్న నిఖిల్‌కు రూ.40 వేలతో కూడిన చెక్ అందజేశారు. ఈ కార్యక్రమంలో స్టార్-50 కోఆర్డినేటర్ మారుతీ శర్మ, లెక్చరర్స్ మహేష్, రజినీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

'ప్రజా సంక్షేమం వదిలేసిన ఎమ్మెల్యే'



మాట్లాడుతున్న సుజాత, సాజిద్‌ఖాన్

బేల: ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న ప్రజల సంక్షేమం వదిలేసి కమీషన్లకే మొగ్గు చూపుతున్నారని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గండ్రత్ సుజాత, డీసీసీ అధ్యక్షుడు సాజిద్ ఖాన్ అన్నారు. సోమవారం సైద్‌పూర్, సాంగ్వి(జి) గ్రామాల్లో గడప గడపకూ కాంగ్రెస్ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటా తిరుగుతూ కాంగ్రెస్ అధికారంలోకి రాగానే చేపట్టే అభివృద్ధి పథకాలపై ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో ఆదిలాబాద్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సంజీవ్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు ఫైజుల్లాఖాన్, నాయకులు రాజీమహ్మద్, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల బంద్ సక్సెస్



నిరసన వ్యక్తం చేస్తున్న ఏబీవీపీ నాయకులు

ఆదిలాబాద్‌టౌన్: విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఏబీవీపీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం నిర్వహించిన పాఠశాలల బంద్ సక్సెస్ అయ్యింది. జిల్లా కేంద్రంలోని ప్రైవేట్ పాఠశాలలు స్వచ్ఛందంగా బంద్‌లో పాల్గొన్నాయి. తెరిచి ఉన్న ప్రభుత్వ పాఠశాలలను ఏబీవీపీ నాయకులు మూసివేయించారు. ఈ సందర్భంగా ఏబీవీపీ జిల్లా కన్వీనర్ అక్షయ్ మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలల్లో ఇష్టారీతిన ఫీజులు వసూలు చేస్తున్నారని, నియంత్రించాల్సిన అధికారులు పట్టించుకోకపోవడంతో తల్లిదండ్రులకు భారంగా మారిందన్నారు. పాఠశాలలు ప్రారంభమై నెలరోజులు కావస్తున్నా విద్యార్థులకు పూర్తిస్థాయిలో పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు అందించలేదన్నారు. సర్కారు బడుల్లో నెలకొన్న సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

నేడు ఇన్‌స్పైర్‌పై సమావేశం

ఆదిలాబాద్‌టౌన్: ఇన్‌స్పైర్, మనక్ 2023 నామినేషన్‌ల నమోదుపై మంగళవారం టెలీకాన్ఫరెన్స్ ద్వారా ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించనున్నట్లు డీఈవో ప్రణీత, జిల్లా సైన్స్ అధికారి రఘురమణ ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి ఈ సమావేశం జరగనుందని, జిల్లాలోని అన్ని యాజమాన్య పాఠశాలల హెచ్‌ఎంలు హాజరు కావాలని సూచించారు.

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి



నిరసన తెలుపుతున్న పెన్షనర్లు

కైలాస్‌నగర్: పెన్షనర్ల న్యాయమైన సమస్యలను వెంటనే పరిష్కరించాలని ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు లక్ష్మారెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం సంఘం ఆధ్వర్యంలో కలెక్టర్ రాహుల్ రాజ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఉద్యోగుల వేతనం నుంచి 1 శాతం మినహాయించి ఆరోగ్య పథకాన్ని (ఈహెచ్ఎస్) అమలు చేయాలని, కమ్యూటేషన్ ద్వారా పొందిన మొత్తాన్ని 12 నెలలకు తగ్గించాలని కోరారు. కార్యక్రమంలో కిష్టయ్య, రాజేశ్వర్‌రెడ్డి, నరేందర్, తదితరులు పాల్గొన్నారు.

నూతన సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం నిర్మాణ స్థలంలో చదును చేస్తున్న దృశ్యం



ఉత్తర ముఖం!

- త్వరలో నూతన కలెక్టరేట్‌కు శంకుస్థాపన
- ఇప్పటికే మొదలైన చదును పనులు
- సీఎం కేసీఆర్ లేదా మంత్రి కేటీఆర్ పనులు ప్రారంభించే అవకాశం

సమీకృత కలెక్టరేట్ వివరాలు..	
నిర్మాణం ఎక్కడ: మావల మండలం బట్టి సావర్గాం	
ఎన్ని ఎకరాలు: 22.3 ఎకరాలు	సర్వే నంబర్లు: 72/1/6, 72/1/3
అంచనా వ్యయం : రూ.55 కోట్లు	

సాక్షి, ఆదిలాబాద్: జిల్లా కేంద్రంలో నూతనంగా నిర్మించనున్న సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (ఐడీవోసీ) నిర్మాణ పనులు త్వరలో ప్రారంభం కానున్నాయి. ప్రస్తుతం ఆ భూమి చదును చేసే ప్రక్రియ మొదలైంది. శంకుస్థాపన చేసేందుకు ముఖ్యమంత్రి కేసీఆర్, లేనిపక్షంలో మున్సిపల్, ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ వచ్చే అవకాశాలు ఉన్నాయి. ఉమ్మడి జిల్లాలో ఇప్పటికే నిర్మల్, మంచిర్యాల సమీకృత కలెక్టరేట్ ప్రారంభించారు. త్వరలో కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో ఓపెనింగ్ చేసేందుకు సిద్ధం చేస్తున్నారు. ఆదిలాబాద్ జిల్లాలో ప్రస్తుతం పనులు మొదలుపెట్టారు.

బడ్జెట్ పెంచేందుకు ప్రతిపాదనలు..

నూతన సమీకృత కలెక్టరేట్ నిర్మాణం కోసం ప్రభుత్వం ఇప్పటికే రూ.55 కోట్ల మంజూరు ఇచ్చింది. దాని ఆధారంగానే ప్రస్తుతం పనులు మొదలు కానున్నాయి. అయితే కలెక్టరేట్‌లో హంగులు, సౌకర్యాల న్నింటినీ దృష్టిలో ఉంచుకుని రూ.69 కోట్లకు పెంచాలని గతంలో అధికారులు ప్రతిపాదనలు పంపారు. దానికి మంజూరు రావాల్సి ఉంది.

హైదరాబాద్ కంపెనీకి..

హైదరాబాద్‌కు చెందిన చాబ్రా అసోసియేషన్ ఈ భవన నిర్మాణ పనులను దక్కించుకుంది. సమీకృత కలెక్టరేట్ నిర్మాణం కోసం నిధులు మంజూరై నెలలు గడుస్తున్నా భూమి వివాదాలను రెవెన్యూ శాఖ పరిష్కరించలేకపోవడంతో ఈ పనులు చేపట్టిన ఆర్ అండ్‌బీ నిర్మాణ పనులను మొదలుపెట్టలేక పోయింది. ఓ రెండెకరాల విషయంలో అసైన్డ్‌దారులతో వివాదం కారణంగా పనుల ప్రారంభంలో ఆలస్యం జరిగింది. అయితే ఆ అసైన్డ్‌దారుల నుంచి భూమికి సంబంధించి అధికారులు పరిహారం మంజూరైనట్లు చెప్పినప్పటికీ అది పూర్తిగా కొలిక్కి వచ్చిందనే దానిపై స్పష్టతనివ్వలేదు. మొదట్లో కలెక్టరేట్ కోసం బట్టిసావర్గాంలో భూమి కేటాయింపు తర్వాత గతేడాది హైదరాబాద్‌నుంచి వచ్చిన ఆర్‌అండ్‌బీ ఈఎన్‌సీ గణపతిరెడ్డి పరిశీలన చేశారు. సమీకృతకు ఇన్, అవుట్ గేట్లు అనువుగా ఉండాలంటే 44వ జాతీయ రహదారి వైపు ఈ భూమిని ఆనుకుని ఉన్న మరో రెండెకరాలు సేకరించాలని, తద్వారా వాస్తుకు అనువుగా ఉంటుందని, అంతేకాకుండా ఒకవైపు నుంచి లోనికి వస్తే మరోవైపు నుంచి బయటకు వెళ్లిపోయేందుకు సరిగ్గా సరిపోతుందని, హెలిప్యాడ్ నిర్మాణం కోసం కూడా కలిసి వస్తుందని అప్పట్లో నిర్ణయించారు. అయితే దీని విస్తీర్ణ నిర్మాణ స్థలం తగ్గడం, ఇన్, అవుట్ గేట్లు వేర్వేరు దిశల్లో లేకపోవడం గమనార్హం. ఈ విషయంలో ఆర్‌అండ్‌బీ ఈఈ నర్సయ్యను వివరణ కోరగా, రెండుమూడు రోజుల్లో నిర్మాణ పనులు ప్రారంభించనున్నట్లు తెలిపారు.

ఉత్తర ముఖం..

ఉత్తర ముఖం ప్రధాన ద్వారంగా సమీకృత కలెక్టరేట్ భవనాన్ని నిర్మిస్తున్నారు. ముందుగా సమీకృత భవనానికి ఇన్, అవుట్ గేట్లు వేర్వేరు దిశలో ఉండేవిధంగా నిర్మాణం చేపట్టే అవకాశాలు ఉన్నాయని మొదట్లో ప్రచారం జరిగింది. అయితే ఉత్తర ముఖంలోనే గేట్లు ఉండనున్నట్లు అధికారులు చెబుతున్నారు. మొదట్లో సమీకృత నిర్మాణం కోసం 26 ఎకరాలు ప్రభుత్వం కేటాయిస్తున్నట్లు ప్రకటించింది. తాజా ప్లాన్ మ్యాప్‌లో 22.3 ఎకరాల స్థలంలో దీని నిర్మాణం చేపడుతున్నట్లు స్పష్టంగా సూచించారు. తద్వారా ముందుగా అనుకున్న స్థలం కంటే దీని స్థలం కొంత తగ్గింది.

ఖాతాల్లోకి 'రైతుబంధు'

- జిల్లాలో 1,63,350 మంది అర్హులు
- రూ.276.19 కోట్ల నిధులు



వ్యవసాయ పనులు చేస్తున్న రైతులు (ఫైల్)

ఆదిలాబాద్‌టౌన్: 2023–24 వానాకలం సీజన్‌కు సంబంధించి రైతుబంధు డబ్బులు సోమవారం నుంచి రైతుల ఖాతాల్లో జమ అవుతున్నాయి. మొదట చిన్న, సన్నకారు రైతులకు సహాయం అందనుంది. విడతల వారీగా మిగితా రైతులకు ప్రక్రియ పూర్తి చేయనున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. కొత్తగా పట్టా పాస్‌బుక్ పొంది దరఖాస్తు చేసుకున్న రైతులకు సైతం ఈ విడతలో రైతుబంధు జమ కానుంది.

రూ.276.19 కోట్ల నిధులు

జిల్లాలోని 18 మండలాల్లో 1,63,350 మంది రైతులను అర్హులుగా గుర్తించిన ప్రభుత్వం రూ.276.19 కోట్ల నిధులను విడుదల చేసింది. గత యాసంగి సీజన్‌కు సంబంధించి జిల్లాలో లక్షా 45వేల 551 మంది ఖాతాల్లో ప్రభుత్వం రూ.263.54 కోట్లు జమ చేసింది. కొత్తగా 17,799 మంది రైతులకు ఈసారి సాయం అందనుంది. ఇందుకు రూ.12.65 కోట్ల నిధులను విడుదల చేసింది. గతేడాది వానాకాలంలో 1,47,161 మంది రైతులకు రూ.267.25 కోట్లు విడుదల చేసింది.

అన్నదాతల్లో ఆనందం..

పెట్టుబడి సహాయం కోసం ఎదురుచూస్తున్న అన్నదాతలకు రైతుబంధు డబ్బులు ఖాతాల్లో జమ కావడంతో హర్షం వ్యక్తం చేస్తున్నారు. పంట సాగు కోసం చేతిలో డబ్బులు లేక అవస్థలు పడుతున్న రైతులకు ప్రభుత్వం తీపి కబురునందించింది.

విడతలవారీగా సాయం



సోమవారం నుంచి ప్రభుత్వం రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేస్తోంది. మొదట ఎకరం భూమి ఉన్న రైతులకు, మిగితా వారికి వారం రోజుల్లోగా జమ చేయనుంది. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

– పుల్లయ్య, డీఏవో

అర్జీలు సత్వరం పరిష్కరించాలి

- కలెక్టర్ రాహుల్ రాజ్



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ రాహుల్ రాజ్

కైలాస్‌నగర్: ప్రజావాణి అర్జీలను పెండింగ్‌లో ఉంచకుండా సత్వరం పరిష్కరించాలని కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి అర్జీదారులతో కిటకిటలాడింది. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. భూ సంబంధ సమస్యలు, విద్య, పింఛన్, ఉపాధి కల్పన, పౌర సరఫరాలు, రెవెన్యూ, డబుల్ బెడ్‌రూం ఇళ్ల వంటి తదితర సమస్యలపై అర్జీలు వచ్చాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాఖల వారీగా పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను పరిశీలించి వాటిని త్వరితగతిన పరిష్కరించేలా శ్రద్ధవహించాలన్నారు. అనంతరం పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులపై ఆయా శాఖల అధికారులతో సమీక్షించారు. కార్యక్రమంలో ట్రెయినీ సహాయ కలెక్టర్ పి.శ్రీజ, ఆర్డీవో రమేశ్ రాథోడ్, జెడ్పీసీఈవో గణపతి, తదితరులు పాల్గొన్నారు.

అర్హులను ఓటర్లుగా నమోదు చేయాలి

కైలాస్‌నగర్: అర్హులందరినీ ఓటరుగా నమోదు చేయాలని కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఓటరు జాబితా తయారీపై తహసీల్దార్లు, సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన ప్రతీ ఒక్కరిని ఫారం-6 ద్వారా ఓటరుగా నమోదు చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. చనిపోయిన, వేరే ప్రాంతాలకు వెళ్లిపోయిన, ఒకే పేరు, ఒకే ఇంటి నంబర్ వంటి వివరాలతో పలు మార్లు ఉన్న ఓటర్లను గుర్తించి ఫారం-7 ద్వారా తొలగించాలన్నారు. ఒకే కుటుంబానికి చెందిన కుటుంబ సభ్యులకు ఒకే పోలింగ్ కేంద్రంలో ఓటుహక్కు కల్పించేలా చూడాలన్నారు. సమావేశంలో శిక్షణ సహాయ కలెక్టర్ పి.శ్రీజ, ఆర్డీవో రమేశ్ రాథోడ్, తహసీల్దార్లు, తదితరులు పాల్గొన్నారు.

కురిసింది వాన..



జిల్లా కేంద్రంలో కురుస్తున్న వర్షం



వర్షంలో తడుస్తూ వెళ్తున్న వాహనచోదకులు

- జిల్లా అంతటా వర్షాలు
- అన్నదాతల్లో హర్షం

ఆదిలాబాద్‌టౌన్: రుతుపవనాల రాకతో ఆదివారం రాత్రి నుంచి సోమవారం రాత్రి వరకు జిల్లాలో ఓ మోస్తారు నుంచి సాధారణ వర్షం కురిసింది. దీంతో ఒక్కసారిగా వాతావరణం చల్లబడింది. విత్తనాలు విత్తుకునే అదను దాటుతున్నా వరుణుడు ముఖం చాటేయడంతో అన్నదాతల్లో ఆందోళన వ్యక్తమైంది. గతేడాది ఇప్పటికే విత్తనాలు విత్తుకోగా, ఈసారి కనీసం 20 శాతం కూడా రైతులు విత్తనాలు వేసుకోలేదు. పత్తి పంట విత్తుకునేందుకు జూలై రెండో వారం వరకు, సోయా పంట వేసుకునేందుకు జూలై మొదటి వారం వరకు గడువు ఉందని వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. ఇన్నిరోజుల పాటు తీవ్ర ఉక్కపోతకు గురైన జిల్లా వాసులు ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో ఉపశమనం పొందారు.

జిల్లా అంతటా వర్షాలు..

ఇచ్చోడలో 56.0 మి.మీ, బజార్‌హత్నూర్‌లో 34.3 మి.మీ, నార్నూర్‌లో 39.5 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. జిల్లాలో ఈ ఏడాది సగటున 1,100 మి.మీ.లు కురువాల్సి ఉంది. జూన్‌కు సంబంధించి 190 మి.మీ.లు కురవాల్సి ఉండగా ఇప్పటివరకు 29 నుంచి 35 మి.మీ.ల వర్షం కురిసిందని వ్యవసాయ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఇంకా 87 మిల్లీమీటర్ల లోటు వర్షపాతం ఉందని పేర్కొంటున్నారు. బంగాళాఖాతంలో అల్పపీడనం, రుతుపవనాలతో వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయని శాస్త్రవేత్తలు అంటున్నారు.

తడిసి ముద్ద..

ఆదిలాబాద్ పట్టణంలో ఆదివారం రాత్రి నుంచి వర్షం కురువడంతో పట్టణమంతా తడిసి ముద్దయ్యింది. జనాలు వర్షంలో తడుస్తూ వెళ్లాల్సి వచ్చింది. ద్విచక్ర వాహనాలపై ఆయా పనుల నిమిత్తం బయటకు వచ్చిన వారు తడుస్తూ వెళ్లగా మరికొంత మంది రెయిన్ కోట్‌లు ధరించి వెళ్లారు.

విద్యార్థులు ధారాళంగా చదివేలా కృషి చేయాలి

- జిల్లా విద్యాశాఖ అధికారి ప్రణీత



విద్యార్థిచే పఠనం చేయిస్తున్న డీఈవో ప్రణీత

ఆదిలాబాద్‌టౌన్: సర్కారు బడుల్లో చదివే ప్రతీ విద్యార్థి ధారాళంగా చదివేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి ప్రణీత అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సంజయ్‌నగర్ ఆర్పీఎల్ పాఠశాలలో పఠనోత్సవ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థుల్లో పఠనాసక్తిని పెంపొందించేందుకు విద్యాశాఖ ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. జూలై 31 వరకు 1 నుంచి పదో తరగతి విద్యార్థులకు ప్రతిరోజు ఒక పీరియడ్ కేటాయించినట్లు తెలిపారు. ఉపాధ్యాయులు బాధ్యతాయుతంగా విద్యార్థులతో పఠనం చేయించాలని ఆదేశించారు. వారానికోసారి పోటీలు నిర్వహించి విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించాలని సూచించారు. జిల్లా, రాష్ట్రస్థాయి పరిశీలకులు కార్యక్రమం అమలు తీరును పరిశీలిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో సెక్టోరల్ అధికారులు సుజాత్‌ఖాన్, కంటె నర్సయ్య, నారాయణ, ప్రధానోపాధ్యాయురాలు షాహెద బేగం, మల్లయ్య, ప్రశాంత్, వేణుగోపాల్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీ పథకాలకు మంగళం



ఈ ఫొటోలో కనిపిస్తున్న రైతు పేరు రాథోడ్ రాందాస్. ఇచ్చోడ మండలంలోని దేవుల నాయక్ తండాకు చెందిన ఇతను ఈ ఏడాది తనకున్న ఐదెకరాల్లో సోయా సాగు చేయడానికి సిద్ధం చేశాడు. మార్కెట్లో రూ.14,500లు వెచ్చించి 5 సోయా బ్యాగులు కొనుగోలు చేశాడు. ప్రభుత్వం సోయాపై సబ్సిడీ ఎత్తేయడంతో రైతుపై అదనంగా రూ.7,500 భారం పడింది. ఇలా జిల్లాలో అనేక మంది రైతులపై అదనపు భారం పడుతోంది.



బహిరంగ మార్కెట్లో రొటోవేటర్లు

- రైతుబంధు రాకతో మాయమైన రాయితీ యూనిట్లు
- విత్తనాలు, పనిముట్లపై సబ్సిడీ ఎత్తివేత
- చిన్న, సన్నకారు రైతులపై అదనపు భారం
- ఊపందుకున్న వానాకాలం సాగు పనులు

ఇచ్చోడ(బోథ్): జిల్లాలోని అన్నదాతలు కోటి ఆశలతో వానాకాలం పంటల సాగు మొదలుపెట్టారు. మృగశిర కార్తె ప్రవేశంతో పొలం బాట పట్టారు. అయితే రైతులకు సర్కారు నుంచి ప్రోత్సాహం లభించడంలేదు. ప్రత్యామ్నాయ లాభసాటి పంటలు వేయాలని ప్రభుత్వం సూచనలు చేస్తూనే రాయితీపై విత్తనాలు, రుణమాఫీ, వ్యవసాయ పనిముట్లు, అందించే పథకాలు క్రమంగా కనుమరుగు చేస్తోంది. రైతుబంధు పథకం వచ్చిన తర్వాత సబ్సిడీ పథకాలన్నీ ఎత్తేయడంతో రైతులు విత్తనాల నుంచి మొదలు వ్యవసాయ పనిముట్ల వరకు పూర్తిగా సొమ్ము చెల్లించి కొనుగోలు చేయాల్సి వస్తోంది. దీంతో రైతన్నకు సాగు భారంగా మారుతోంది.

రూ.8.5 కోట్ల అదనపు భారం

జిల్లాలో పత్తి పంట తర్వాత అత్యధికంగా సాగయ్యే పంట సోయా. గతంలో ప్రభుత్వం సోయా విత్తనాలను రైతులకు 50 శాతం సబ్సిడీపై అందజేసేది. కానీ మూడేళ్లుగా సబ్సిడీ పూర్తిగా నిలిపేసింది. దీంతో పూర్తి ధర చెల్లించి రైతులు బహిరంగ మార్కెట్లో విత్తనాలు కొనుగోలు చేయాల్సివస్తోంది. సబ్సిడీ ఎత్తివేతతో జిల్లా రైతులపై రూ.8.5 కోట్ల అదనపు భారం పడుతోంది.

జిల్లాలో రైతుల వివరాలు	
చిన్నకారు రైతులు:	52,166
సన్నకారు రైతులు:	44,643
పెద్ద రైతులు:	3,191

జాడలేని పంటల బీమా

వాతావరణ ఆధారిత పంటల బీమా పథకానికి రాష్ట్ర ప్రభుత్వం మంగళం పాడింది. కొన్నేళ్ల నుంచి పత్తి పండిస్తున్న రైతులు అతివృష్టి, అనావృష్టి కారణంగా దిగుబడులు రాక తీవ్రంగా నష్టపోతున్నారు. వారికి లబ్ధిచేకూర్చేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా ఆరేళ్ల క్రితం వాతావరణ ఆధారిత పంటల బీమా పథకాన్ని ప్రవేశపెట్టాయి. పథకంలో 80 శాతం మంది రైతులు చేరారు. రెండేళ్ల క్రితం అతివృష్టితో నష్టపోయిన రైతులు ఎకరాకు రూ.12 వేల చొప్పున పరిహారం పొందారు. ఆతర్వాత రాష్ట్ర ప్రభుత్వం ఈ పథకాన్ని నిలిపివేసింది. ఫలితంగా ప్రకృతి వైపరీత్యాలతో పంటలు నష్టపోయిన రైతులు పరిహారానికి నోచుకోవడంలేదు.

'యంత్రలక్ష్మి'కి మంగళం

రైతులు ఆధునిక వ్యవసాయం చేసేందుకు సాగులో యాంత్రీకరణ పెంచేందుకు ప్రభుత్వం యంత్రలక్ష్మి పథకాన్ని ప్రవేశ పట్టింది. దీని ద్వారా చిన్న సన్నకారు రైతులకు సబ్సిడీపై ట్రాక్టర్లు, రొటోవేటర్లు, నాగళ్లు, పవర్‌స్ప్రేలు, యంత్రాలు రాయితీపై అందించేది. యంత్ర లక్ష్మి పథకాన్ని పూర్తిగా ఎత్తివేసింది. దీంతో రైతులు పనిముట్లు సైతం బయట మార్కెట్లో కొనుగోళ్లు చేయాల్సి వస్తోంది.

అటకెక్కిన రుణమాఫీ

2018 డిసెంబర్ 11 లోపు రైతులు తీసుకున్న రూ.లక్ష లోపు పంట రుణాలు మాఫీ చేస్తామని గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. నాలుగేళ్లు దాటినా ఇప్పటికీ అమలుకు నోచుకోలేదు. ఇప్పటి వరకు కేవలం 20 వేల మంది రైతులకు సంబంధించిన కేవలం రూ.39 వేలలోపు రుణాలు మాత్రమే మాఫీ చేశారు. మరో 80 వేల మంది రైతుల రుణాలు మాఫీ కావాల్సి ఉంది.

రద్దయిన పావలా వడ్డీ

పంటలపై తీసుకున్న రుణాలు మార్చి 30లోపు చెల్లించిన వారికి గతంలో పావలా వడ్డీ మాత్రమే వసూలు చేసేవారు. మిగితా వడ్డీ రాష్ట్ర ప్రభుత్వం చెల్లించేది. మూడేళ్ల క్రితం పావలా వడ్డీని ప్రభుత్వం రద్దు చేసింది. దీంతో రైతులకు పంట రుణాలపై వడ్డీ భారం తప్పడంలేదు.

విత్తనాలు సబ్సిడీపై అందించాలి



విత్తనాలు సబ్సిడీపై అందించక పోవడంతో చిన్న సన్నకారు రైతులపై అదనపు భారం పడుతోంది. రైతులకు సంబంధించిన పథకాలపై ప్రభుత్వం పునరాలోచించాలి. విత్తనాలు, వ్యవసాయ పనిముట్లు సబ్సిడీపై అందించాలి.

– బొర్రన్న, రైతు స్వరాజ్యవేదిక జిల్లా అధ్యక్షుడు

క్లుప్తంగా

30న జాబ్‌మేళా

ఉట్నూర్‌రూరల్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని గిరిజన నిరుద్యోగ యువతి, యువకుల కోసం ఉట్నూర్‌లోని యూత్ ట్రైనింగ్ శిక్షణ కేంద్రంలో ఈనెల 30న జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ఐటీడీఏ పీవో వరుణ్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు ఈ మేళా ఉంటుందని పేర్కొన్నారు. ఎంఎస్ఎన్ ల్యాబోరేటరీస్, బయోఆర్గానిక్, ఫ్లిప్‌కార్ట్, క్రీమ్‌స్టోన్, మెడ్‌ప్లస్ కంపెనీల్లో 325 ఉద్యోగాలకు ఎంపిక ఉంటుందని వివరించారు. మేళాలో పాల్గొనేవారు 18–35 ఏళ్లలోపు ఉండాలని పేర్కొన్నారు. బయోడేటా, విద్యార్హత, కుల ధ్రువీకరణ పత్రాల జిరాక్స్ కాపీలతో హాజరుకావాలని సూచించారు. వివరాలకు 78936 16392 సెల్‌నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

చోరీ కేసులో ఒకరి రిమాండ్

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని టూటౌన్ పరిధిలోని ఫిల్టర్‌బెడ్‌లో చోరీకి పాల్పడిన నిందితుడు సాహిర్‌ను పట్టుకుని సోమవారం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై ఊశన్న తెలిపారు. తాను ఉంటున్న అద్దె ఇంట్లో ఈనెల 23న చోరీకి పాల్పడ్డాడు. టీవీ, గ్యాస్ సిలిండర్, రూ.5 వేల నగదును ఎత్తుకెళ్లాడు. బాధితుడు బండ ప్రశాంత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

వర్షానికి కూలిన ఇల్లు


కూలిన లోపలి భాగం

బోథ్: మండలంలోని ధన్నూర్(బి) గ్రామంలో వర్షానికి ఇల్లు కూలింది. ఇటీవల కురిసిన వానలకు ఇంటి పైభాగంలో నీరు చేరడంతో కర్ర తడిచి కూలిపోయింది. ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. తన భర్త నర్సారెడ్డి కొన్నేళ్ల క్రితం మృతిచెందాడని, ప్రభుత్వం అందిస్తున్న ఆసరా పెన్షన్‌తో జీవిస్తున్న తనకు సాయం అందించాలని బాధితురాలు తోట భోజమ్మ వేడుకుంటుంది.

చిరుత దాడిలో లేగదూడ మృతి

తిర్యాణి: మండలంలోని గిన్నెదరి రేంజ్ పరిధిలోని మందగూడ అటవీ ప్రాంతంలో లేగదూడపై చిరుత దాడి చేసి హతమార్చింది. ఫారెస్టు సెక్షన్ అధికారి శ్రీనివాస్ కథనం ప్రకారం.. ఆదివారం సాయంత్రం మందగూడ శివారులోని అటవీ ప్రాంతంలో నైతం లక్ష్మణ్‌కు చెందిన లేగదూడపై చిరుత దాడి చేసి చంపింది. కాగా, ఆ ప్రాంతాన్ని ఫారెస్టు అధికారులు సోమవారం పరిశీలించారు. సెక్షన్ అధికారులు శ్రీనివాస్, సూర్యారావు, బీట్ అధికారులు అవినాష్, సురేశ్ ఉన్నారు.

కొయ్య కొరత తీర్చేలా..


పొనికి కర్రతో నిర్మల్ బొమ్మలు తయారు చేస్తున్న కళాకారులు

- నిర్మల్ జిల్లాలో పొనికి వనాల పెంపకానికి చర్యలు
- అనువైన స్థలాలు గుర్తింపు
- హరితహారంలో మొక్కలు నాటేలా చర్యలు
- బొమ్మల తయారీకి ఊతమిచ్చేలా..


అడవుల్లో సహజసిద్ధంగా పెరిగే పొనికి చెట్టు

నిర్మల్‌ఖిల్లా: నిర్మల్ అనగానే మొదట గుర్తొచ్చేది కొయ్యబొమ్మలే..వీటి తయారీ పరిశ్రమ కొలువుదీరింది ఇక్కడే. పొనికి చెట్టు నుంచి తీసే కలప ముడిసరుకుతో ఈ బొమ్మలను కళాకారులు తయారు చేస్తారు. ఈ కర్ర మృదువుగా, తేలికగా ఉపయోగించవచ్చు. ప్రస్తుతం అడవుల్లో పొనికి చెట్లు కనుమరుగవడంతో జిల్లాలో గత ఐదారేళ్లుగా బొమ్మల తయారీ పరిశ్రమ తీవ్ర సంక్షోభం ఎదుర్కొంటోంది. దాదాపు 150 కళాకారుల కుటుంబాలు ఈ పరిశ్రమపై ఆధారపడి జీవిస్తున్నాయి. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం పొనికి మొక్కల పెంపకానికి చర్యలు చేపట్టింది. ఈ మేరకు మొక్కల పెంపకానికి అనువైన ప్రాంతాలను అధికారులు గుర్తించారు. హరితహారంలో భాగంగా మొక్కలు నాటారు. ఉపాధి హామీ పథకంలో భాగంగా సంరక్షణ చర్యలు చేపడుతున్నారు.

పొనికి కర్ర ప్రత్యేకం..
నిర్మల్ కొయ్యబొమ్మల తయారీకి ఉపయోగించే పొనికి చెట్టు నుంచి తీసిన కలప చాలా ప్రత్యేకం. ఎందుకంటే ఈ పొనికి కర్ర తేలికగా సరళంగా ఉండి, బొమ్మను చెక్కే క్రమంలో మృదువుగా ఉంటుంది. బొమ్మల తయారీలో కళాఖండంగా తీర్చిదిద్దవచ్చు. అందుకే పొనికి కర్రను వినియోగిస్తామని కళాకారులు అంటున్నారు.

పొనికి మొక్కల పెంపునకు అనువైన ప్రాంతాలు..
పొనికి మొక్కల పెంపకం కోసం ప్రయోగాత్మకంగా పలు గ్రామ పంచాయతీలను డీఆర్డీఏ, ఇతర అధికారులు ఎంపిక చేశారు. మట్టి నమూనా పరీక్షల ఆధారంగా మామడ మండలం కొరిటికల్, గాయిద్‌పెల్లి, మొండిగుట్ట, తాండ్ర, వాస్తాపూర్, లింగాపూర్, తోటిగూడ, రాయదారి, సారంగాపూర్ మండలం గోపాల్‌పేట్ సమీపంలోని అటవీప్రాంతం అనువైనవిగా గుర్తించారు. ఇప్పటికే మట్టికి భూసార పరీక్ష అనంతరం ఇక్కడ మొక్కలు నాటి సంరక్షిస్తున్నారు. రాయదారి సమీపంలో 500 మొక్కలు నాటారు. మొదటగా లింగాపూర్ శివారులోని ప్రభుత్వ భూమిలో హరితహారం కింద వెయ్యి పొనికి మొక్కలు నాటారు. వాస్తాపూర్, గాయిద్‌పెల్లి తదితర గ్రామాల్లో దశలవారీగా మొక్కల పెంపకం చేపట్టనున్నారు. సారంగాపూర్ మండలం గోపాల్‌పేట సమీపంలో మహబూబ్ ఘాట్స్ ప్రాంతంలో 2,200 మొక్కలు నాటారు. నీటి వసతి కోసం ప్రత్యేకంగా డీఆర్డీఏ అధికారులు బోర్‌వెల్ వేయించారు.


మామడ మండలంలో పొనికి మొక్కలు నాటుతున్న అధికారులు

మొక్కలు నాటించాం



పొనికి కర్రకు తీవ్రమైన కొరత ఏర్పడిన విషయాన్ని గుర్తించాం. జిల్లా కలెక్టర్ ప్రోత్సాహంతో హరితహారంలో మొక్కల ప్లాంటేషన్‌ను పకడ్బందీగా చేపడుతున్నాం. కొన్ని ప్రాంతాలను గుర్తించి మొక్కలు నాటించాం. సంరక్షణ చర్యలు తీసుకుంటున్నాం.
– కె.విజయలక్ష్మి, జిల్లా గ్రామీణాభివృద్ధిశాఖ అధికారి

హర్షణీయం



పొనికి కలపతో తయారీ చేసిన కొయ్య బొమ్మలు ఎక్కువకాలం మన్నిక ఉంటాయి. వీటి తయారీపై ఆధారపడిన కళాకారుల కుటుంబాలు కర్ర కొరతతో ఇబ్బంది పడ్డాం. రాష్ట్ర ప్రభుత్వం, డీఆర్డీఏ అధికారులు జిల్లాలో పొనికి వనాల పెంపకం చేపట్టాలని నిర్ణయం తీసుకోవడం హర్షణీయం.
– నాంపల్లి రాజశేఖర్‌వర్మ, కళాకారుడు, నిర్మల్

వర్షంలో తడుస్తూ దివ్యాంగుల నిరసన


నిరసన తెలుపుతున్న దివ్యాంగులు

కైలాస్‌నగర్: జిల్లాకేంద్రంలో వికలాంగులకు ప్రత్యేక కాలనీ ఏర్పాటు చేయాలనే డిమాండ్‌తో ఎన్పీఆర్డీ ఆధ్వర్యంలో చేపట్టిన ఆందోళన 28వ రోజుకు చేరింది. అయినా అధికారులు స్పందించడం లేదని ఆరోపిస్తూ సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరం వద్ద జోరుగా కురుస్తున్న వర్షంలో తడుస్తూ తమ నిరసన తెలిపారు. కలెక్టర్ బయటకు రావాలని నినాదాలు చేశారు. విషయం తెలుసుకున్న కలెక్టర్ రాహుల్‌రాజ్ గొడుగుసాయంతో వారి వద్దకు వచ్చి సమస్యలను విన్నారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా కృషిచేస్తానని భరోసానివ్వడంతో వారు ఆందోళనను విరమించారు. ఎన్పీఆర్డీ నాయకులు, దివ్యాంగులు పాల్గొన్నారు.


వర్షంలో గొడుగుపట్టుకుని దివ్యాంగుల సమస్యలను వింటున్న కలెక్టర్

అర్జీలు సత్వరం పరిష్కరించాలి

- డీడీ దిలీప్‌కుమార్

ఉట్నూర్‌రూరల్: అర్జీలను సత్వరం పరిష్కరించాలని డీడీ దిలీప్ కుమార్ అన్నారు. ఉట్నూర్ ఐటీడీఏ కార్యాలయ సమావేశమందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజా వాణిలో గిరిజనుల అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజనుల అర్జీలను శాఖల అధికారులు పరిశీలించి వెంటనే న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో ఏపీవో కనక భీంరావు, ఏడీఎంఅండ్‌హెచ్‌వో కుమ్ర బాలు, ఐటీడీఏ ఏవో రాంబాబు, ఏపీవో పీవీటీజీ ఆత్రం భాస్కర్, పీహెచ్‌వో సందీప్, జేడీఎం నాగభూషణం, ప్రిన్సిపాల్ మెస్రం మనోహర్, డీపీవో ప్రవీణ్, అధికారులు పాల్గొన్నారు.


అర్జీలు స్వీకరిస్తున్న డీడీ దిలీప్‌కుమార్

- తిర్యాణి మండలం మంగి గ్రామానికి చెందిన కుమ్ర మమత ఇంటర్మీడియట్‌లో అడ్మిషన్ ఇప్పించాలని విన్నవించింది.
- తనకు ఆర్‌వోఎఫ్ఆర్ పట్టా మంజూరు చేయాలని ఉట్నూర్ మండలం బీర్సాయిపేట్ గ్రామానికి చెందిన సీహెచ్ జైతు అర్జీ అందించారు.
- ఎడ్ల జత అందించాలని తలమడుగు మండలం నందిగామ గ్రామానికి చెందిన ఆత్రం మోతీరాం విన్నవించారు.
- తనకు ఆశావర్కర్ ఉద్యోగం ఇప్పించాలని ఉట్నూర్ మండలం ఉమాపతికుంట గ్రామానికి చెందిన మంగం సంగీత అర్జీ సమర్పించింది.

గంగమ్మతల్లికి పూజలు

జైనథ్: మండలంలోని మాండగాడ గ్రామస్తులు సోమవారం గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. డొల్లార సమీపంలో పెన్‌గంగ నది ఒడ్డున పిండివంటలు వండుకుని అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు పండాలని మొక్కుకున్నారు. అనంతరం గంగ నీళ్లను తీసుకువచ్చి, గ్రామదేవతలకు జలాభిషేకం చేశారు. గంగమ్మ వద్ద పూజలు చేస్తుండగానే వరుణుడు కరుణించడంతో గ్రామస్తులు సంతోషించారు. వర్షంలో తడుస్తూ..గంగానీళ్లతో కాలినడకన గ్రామానికి చేరుకున్నారు.


గంగమ్మ నీళ్లతో తిరుగుపయనమైన గ్రామస్తులు

ముగిసిన టీసీఏ జిల్లాజట్టు ఎంపిక పోటీలు

ఆదిలాబాద్: తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని వీఎస్ఆర్ క్రికెట్ అకాడమీలో ఆదివారం నిర్వహించిన అండర్–19, 25 జిల్లా క్రికెట్ జట్ల ఎంపిక పోటీలు ముగిశాయి. జిల్లా జట్లకు ఎంపికైన క్రీడాకారులు అంతర్ జిల్లా పోటీల్లో పాల్గొంటారని టీసీఏ జిల్లా ఇన్‌చార్జి నరోత్తంరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఇందులో ప్రతిభ కనబర్చిన వారు రాష్ట్రస్థాయి జట్టుకు ఎంపిక అవుతారన్నారు.

అండర్–19 జిల్లా జట్టు..
మణిశ్వర్, అరవింద్, ఉజ్వల్, రెహాన్‌ఖాన్, దైవిక్ రెడ్డి, శ్రీచరణ్, పవన్, బిలాల్, షాహిద్, వంశీ, అంకిత్, అమన్, ధీరజ్ శివ సూరజ్ ఉబైద్.


జిల్లా జట్టుకు ఎంపికైన అండర్–19, 25 క్రికెటర్లు

అండర్–25 జట్టు..
గంగాప్రసాద్, సాయిప్రసాద్, శుభం, ప్రభా, అనాజ్, రెహన్, సురేష్, రెహాన్‌ఖాన్, సద్దాం, అనికేత్, రోహిత్, జైపాల్, సచిన్, బిలాల్, అమన్.

అజీమ్ ప్రేమ్‌జీ యూనివర్సిటీలో సీఓఈ విద్యార్థికి సీటు

బెల్లంపల్లి: ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ (సీఓఈ) బెల్లంపల్లి కళాశాల విద్యార్థి ప్రతిష్టాత్మక అజీమ్ ప్రేమ్ జీ యూనివర్సిటీలో సీటు సాధించాడు. సీఓఈలో ఇంటర్మీడియెట్ పూర్తి చేసుకున్న మల్లెపూల సాయితేజ బెంగళూరులోని అజీమ్ ప్రేమ్ జీ యూనివర్సిటీలో ప్రవేశం కోసం పరీక్ష రాశాడు. రాతపరీక్ష ఆన్‌లైన్‌లో నిర్వహించిన మౌఖిక పరీక్షలో నైపుణ్యత కనబర్చడంతో సీటు వరించింది. సాయితేజ..అండర్ గ్రాడ్యుయేషన్ బీఎస్సీ బీఎడ్ సీటు దక్కించుకుని ప్రతిభ చాటుకున్నట్లు ప్రిన్సిపాల్ ఐనాల సైదులు ప్రకటించారు. సాయితేజతోపాటు సీఓఈలో చదివిన తాటి సాయి, సునార్కర్ అఖిలేశ్వర్ కూడా సీట్లు సాధించినట్లు వివరించారు. కష్టపడే తత్వం, పట్టుదల ఉంటే ఏ యూనివర్సిటీలోనైనా సీటు సాధించవచ్చని సీఓఈ విద్యార్థులు నిరూపిస్తున్నారని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఆర్‌సీవో స్వరూపరాణి సోమవారం ప్రశంసించారు.



సాయితేజను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ సైదులు

భైంసాలో 40.6 మి.మీ. వర్షపాతం

భైంసాటౌన్: పట్టణంలో ఆదివారం రాత్రి మోస్తరు వాన కురిసింది. 40.6 మి.మీల వర్షపాతం నమోదైంది. దాదాపు గంటసేపు ఏకధాటిగా వర్షం కురవడంతో రోడ్లు జలమయమయ్యాయి. సోమవారం ఉదయం నుంచి రోజంతా జల్లు కురిసింది. భైంసాలో వారసంత సందర్భంగా కూరగాయలు విక్రయించేందుకు వచ్చిన రైతులు, వ్యాపారులు వర్షానికి ఇబ్బందులు పడ్డారు.

కడెం: మండల కేంద్రంతోపాటు, గ్రామాల్లో సోమవారం మోస్తారు వాన కురిసింది. చెరువులు, కుంటల్లోకి నీళ్లు వస్తుండడంతో వానాకాలం సాగు పనులు చేపట్టిన రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.


కురుస్తున్న వర్షం

ఖానాపూర్: మండలంలో రెండు రోజులుగా రాత్రి కురుస్తున్న వర్షం సోమవారం మధ్యాహ్నం ముసురుగా మారింది.

ఉపాధి కూలీలపై తేనెటీగల దాడి

జన్నారం: మండలంలోని తిమ్మాపూర్‌కు చెందిన 40 మంది ఉపాధి కూలీలపై తేనెటీగలు దాడి చేశాయి. ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. వివరాలు ఇలా ఉన్నాయి..సమీప అటవీ ప్రాంతంలో వందమంది కూలీలు సోమవారం ఉపాధి హామీ పనులు చేపడుతున్నారు. ఆ ప్రాంతంలో పొదలో తేనెటీగలు తెట్టె పెట్టాయి. గమనించకుండా బండరాళ్లను పొదలో వేయడంతో తేనెటీగలు ఒక్కసారిగా కూలీలపై దాడి చేసి కుట్టాయి. గాయపడినవారిని సర్పంచ్ జాడి గంగాధర్ తాళ్లపేట్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు ప్రథమ చికిత్స చేశారు. వందచోట్ల తేనెటీగలు కుట్టడంతో దేవ లింగన్న పరిస్థితి విషమించడంతో మంచిర్యాల ఆసుపత్రికి తరలించారు. మిగతా కూలీలు చికిత్స అనంతరం ఇళ్లకు వెళ్లారు.

దళిత, గిరిజనులను మోసం చేసిన కేసీఆర్

- కిసాన్‌సెల్ రాష్ట్ర అధ్యక్షుడు అన్వేశ్‌రెడ్డి

కడెం: సీఎం కేసీఆర్ దళిత, గిరిజనులను మోసం చేశారని కాంగ్రెస్ పార్టీ కిసాన్‌సెల్ రాష్ట్ర అధ్యక్షుడు సుంకెట అన్వేశ్‌రెడ్డి ఆరోపించారు. మండలంలోని కొండుకూర్ గ్రామంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఉట్నూర్ జెడ్పీటీసీ, పీసీసీ సభ్యురాలు రాథోడ్ చారులత ఆధ్వర్యంలో సోమవారం దళిత, గిరిజన ఆత్మ గౌరవసభ నిర్వహించారు. ముఖ్య అతిథిగా అన్వేశ్ రెడ్డి హాజరయ్యారు. దళితబంధు పేరుతో లబ్ధిదారుల నుంచి కొందరు ఎమ్మెల్యేలు, నాయకులు మూడు లక్షల వరకు వసూలు చేశారన్నారు. దళితులకు మూడెకరాల భూమి అని కొంతమందికి ఇచ్చి హామీని మరిచారన్నారు. ఇప్పటి వరకు ఖానాపూర్ నియోజవర్గంలో ఒక్క డబుల్‌బెడ్‌రూం ఇళ్లు పంపిణీ చేయలేదని తెలిపారు. కాంగ్రెస్ హయంలో ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖరరెడ్డి ఇందిరమ్మ పథకాన్ని ప్రవేశపెట్టి గూడులేని ఎంతో మంది నిరుపేదలకు ఇంటి నిర్మాణానికి సాయం అందించారని అన్నారు. గతేడాది కడెం ప్రాజెక్ట్ నుంచి వచ్చిన భారీ వరదలతో ఎంతో మంది రైతుల భూములు, పంటలు నష్టపోయినా ప్రభుత్వం సాయం అందించకపోవడం సిగ్గుచేటన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే.. వరంగల్ డిక్లరేషన్‌లో ప్రకటించిన విధంగా ఏక కాలంలో రూ.2 లక్షల రుణమాఫీ, ధరణి పోర్టల్ రద్దు, కిసాన్ కమిషన్ ఏర్పాటు, వ్యవసాయానికి ఉపాధిహామీ పథకం వర్తింపు, పోడు, అసైన్డ్ భూములకు యాజమాన్య హక్కులు, కౌలు రైతులకు రూ.15 వేలు, భూమిలేని ఉపాధిహామీ కూలీలకు ఏడాదికి రూ.12 వేల సాయం, భూమిలేని రైతులకు రైతుబీమా వర్తింపు, రూ.500లకే సిలిండర్, తదితర పథకాలను అమలు చేస్తామని వివరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గిరిజన విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు భరత్ చౌహాన్, ఎల్‌డీఎం(లీడర్‌షిప్ డెవలప్‌మెంట్ మిషన్) పార్లమెంట్ ఇన్‌చార్జి రఘునాథరెడ్డి, నియోజవర్గ ఇన్‌చార్జి సత్యనారయణ, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు రమేశ్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు చంద్రయ్య, మహిళ విభాగం జిల్లా ఉపాధ్యాక్షురాలు గీతారెడ్డి, జిల్లా నాయకులు మల్లారెడ్డి, శంతన్‌రెడ్డి, సతీశ్‌రెడ్డి, ప్రభాకర్, బాపురావు, సత్యం, వెంకటేశ్, సలీం, రహీం, శంకర్ తదితరులు ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అన్వేశ్‌రెడ్డి

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

ఆదిలాబాద్‌రూరల్: రాష్ట్ర ప్రభుత్వం బీసీ స్టడీ సర్కిల్ ద్వారా అందించనున్న సివిల్స్ లాంగ్ టర్మ్ ఉచిత శిక్షణకు (ప్రిలిమ్స్ కమ్ మెయి న్స్) దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా బీసీ అభివృద్ధి శాఖ అధికారి రాజలింగు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 26 నుంచి జూలై 10 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారికి జూలై 16న ఆన్‌లైన్‌లో పరీక్ష నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన ఉమ్మడి జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. శిక్షణ తరగతులు జూలై 31 నుంచి 2024 ఏప్రిల్ 30 వరకు ఉస్మానియా యూనివర్సిటీలో కొనసాగుతాయన్నారు. లాడ్జింగ్, బోర్డింగ్, రవాణా కోసం రూ.5వేలు, రూ.5వేల విలువ చేసే స్టడీ మెటీరియల్ ఇవ్వనున్నట్లు తెలిపారు. 31 సంవత్సరాల లోపు ఉండి సివిల్ సర్వీస్ (ప్రిలిమ్స్) పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన వారు మాత్రమే అర్హులన్నారు. మరిన్ని వివరాలకు 08732–221280 నంబరులో సంప్రదించాలని ఆయన సూచించారు.

‘విశ్వ గురువుగా భారత్’

జైనథ్: మోదీ తొమ్మిదేళ్ల పాలనలో దేశం విశ్వ గురువుగా ఎదిగిందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్ అన్నారు. సోమవారం మేడిగూడలో మహా సంపర్క్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ తిరుగుతూ కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించారు. 65 ఏళ్ల కాంగ్రెస్ పాలనలో దేశం అట్టడుగు స్థాయికి చేరిందన్నారు. కేంద్ర ప్రభుత్వం ఆదిలాబాద్‌కు సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి కట్టి ఇస్తే దాన్ని నడిపే సత్తా కూడ కేసీఆర్ ప్రభుత్వానికి లేదని ఎద్దేవా చేసారు. నిరుపేదలకు డబుల్ బెడ్‌రూంలు వంటి హామీలు నెరవేర్చని బీఆర్ఎస్‌కు ఈ ఎన్నికల్లో ఓట్లు అడిగే హక్కు లేదన్నారు. రానున్న రోజుల్లో రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు కట్కం రాందాస్, నాయకులు రమేశ్, జ్యోతి, జ్యోతిరెడ్డి, కరుణాకర్‌రెడ్డి, సంతోష్, ముకుంద్ రావ్, తదితరులు పాల్గొన్నారు.


ప్రజలకు వివరిస్తున్న పాయల్ శంకర్

బహిరంగ సభ విజయవంతం చేయండి

ఆదిలాబాద్‌రూరల్: హైదరాబాద్‌లోని నిజాం కాలేజ్ మైదానంలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఈనెల 30న నిర్వహించే బహిరంగ సభ ను విజయవంతం చేయాలని జాతీయ ప్రధా న కార్యదర్శి మోతె బారిక్‌రావ్ పిలుపునిచ్చా రు. జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ భవనంలో సోమవారం బహిరంగసభ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణపై అసెంబ్లీలో సీఎం కేసీఆర్ ఇచ్చినా హామీ మేరకు ప్రత్యేక చొరవతో కేంద్రాన్ని ఒప్పించాలన్నారు. మా దిగల జనాభా ప్రతిపాదికన వచ్చే అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో సీట్లు కేటాయించాలన్నారు. నాయకులు బొజ్జ అడేల్లు, ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు